# ఊహ

(జూన్, 99 స్వాతి మాసపత్రికలో ప్రచురితం)

---

ఊహ ఉత్తమనిషి కాదు. (కొంపదీసి కడుపుతో వుందనుకునేరు.... అదేం కాదు) ఉద్యోగం చేస్తున్నది. ఆమె తల్లిదండ్రులు ఊహ చదువు విషయంలో చదువుకుని ఉద్యోగం చేయాలా? ఊళ్ళేలాలా అనుకోలేదు కాబట్టి ఉద్యోగం చేస్తున్నది. వాళ్ళలా అనుకుని వుంటే బహుశా ఊళ్ళేలుతూ వుండేదేమో మరి!

ఊహ ఉద్యోగం చేస్తున్నది కాబట్టి ఆమె భర్త కాంతారావు కూడా ఉద్యోగం చేస్తున్నాడు. చదువుకోని ఆడపిల్ల కూడా ఉద్యోగం చేసే భర్త కావాలనుకుంటుందైతే ఇక ఉద్యోగస్తురాలు నిరుద్యోగైనవాడ్ని భర్తగా అంగీకరిస్తుందా?

జీతంవరకైతే కాంతారావు జీతమే భార్యకి వచ్చే జీతం కన్నా ఎక్కువ. అయితే ఇక్కడో తిరకాసు వున్నది. సంపాదన ఎవరిది ఎక్కువ అవంటే మాత్రం ఊహదే ఎక్కువని చెప్పాల్సొస్తుంది. ఆమె ఉద్యోగం అలాంటిది మరి. అందులోనూ ఆమె సీటుకు ఆ సదవకాశం మరింత జాస్తి.

మిగిలిన వాళ్ళ సంగతి నాకు తెలియదుగానీ ఈ విషయం విన్నప్పుడు విపరీతంగా విస్మయానికి గురయ్యాన్నేను. అసలు మరి ఆడవాళ్ళు కూడా లంచాలు తీసుకుంటారనే విషయం నాకు తేలిగ్గా మింగుడు పడలేదు.

అయితే ఈ విషయంలో నేను విన్న వెసులుబాటు ఏమిటంటే ఆడవాళ్ళు మగవాళ్ళలా బల్లలక్రింద చేతులు పెట్టరట. ధైర్యంగా నిర్లజ్జగా, నిస్సంకోచంగా బల్లపైనే చేతులుంచేసి దర్జాగా, అదితమ హక్కులాగా, దబాయించి మరీ తీసేసుకుంటారట.

ఈ విషయంపైని చాలా అసహ్యకరంగా ఊహ వాళ్ళ ఆఫీసుకి వెళ్ళాను. అదే పనిగా ఆమెను చూసేందుకు. నిజం చెప్పొద్దూ నిండు కుండలా, నిదానస్తురాలిలా, అంతకంటే ఎక్కువ మర్యాదస్తురాలిలా చాలా అందంగా వుంది ఊహ. ఒకసారి చూస్తే మనసులో గుర్తుండి పోయే రూపసి ఊహ. ఆమె అందానికి. ఆమె లంచం తీసుకోవటానికి ఏమాత్రం సంబంధం లేకపోయినా ఎందుకో ఆ మాట నమ్మలేకపో యాన్నేను, అదేం చిత్రమో! ఆటుతర్వాత అనుభవాలు నమ్మింప జేసినై. నమ్మక తప్పిందికాదు

అయినవాళ్ళందరూ ఊహించినదానికంటే చాలా ఎక్కువే వెనకేసింది ఊహ. ఇంట్లోకి కావలసిన సామానంతా సమకూర్చు కున్నది. కోరుకున్న నగలన్నీ చేయించుకున్నది. కారు కూడా కొనే యాలని కలలుకంటున్నది. కానీ, కానివాళ్ళంతా కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారని అదీగాక ఆదాయం పన్నువాళ్ళు కళ్ళల్లో వత్తులేసు కుంటారని, కాబట్టి కారు కొనే విషయంలో కారుకూతలకి అవకాశం లేనివిధంగా ఆచితూచి. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని భర్త గారైన కాంతారావు హితబోధ చేయటంతో కారు విషయంలో జారిపోయింది ఊహ.

లంచగొండితనాన్ని విమర్శిస్తూ రాసిన కవితలన్నా, కథలన్నా కంటబడినప్పుడు కన్నెర్ర చేస్తుంటుంది ఊహ. అసలిలాంటి పనికి మాలిన వ్రాతలు రాసేవారు ఎంతటి అవివేకులో, అసమర్థులో, అమాయకులో ఊహ ఊహకందని విషయం, అలాంటివారి గురించి విన్నప్పుడు విరగబడి నవ్వుకుంటుంది ఆమె మనసు అయినా వినయమే నటిస్తుంది ఆమె బొగను. అలాంటి ఉద్యోగం చేస్తూ, అంత సంపా దిస్తున్న ఊహ కాంతారావును కట్నం చెల్లించే పెళ్ళి చేసుకున్నది. కట్నం డబ్బంతా లంచంగా వచ్చిందేనా అని పెళ్ళయిన కొత్తల్లో

వేళాకోళంగా అంటుండేవాడు కాంతారావు. ఒకటికి నాలుగుసార్లు ఉపేక్షించిన ఊహ ఓసారి "అయితే మీకు పనికిరాదా? తిరిగి ఇచ్చేయండి, నిక్షేపంగా తీసేసుకుంటాని" అనడంలో నిమ్మకుండి పోయాడు కాంతారావ్.

ఇంతకీ నేనింతటి "ఊహ"గానం చేయటానికి కారణం నాకూ ఆ ఊహతో పని కావలసిరావడమే. తెలిసినవాళ్ళ ద్వారా విన్నదే మంటే ఆమె "డబ్బుమనిషి" అని, లంచం ఇవ్వందే ఏ పనీ కాదని విని ఆశ్చర్యపోయి, అనక ఈ వివరాలు తెలుసుకున్నాను

లంచం ఇవ్వటమో, ఇవ్వకపోవటమో కాకుండా, నా పని అయినా కాకపోయినా ఆమెతో ఈ విషయంగా కాసేపు మట్లాడి ఆమె సమాధానం వినాలన్న కుతూహలం కలిగింది నాకు.

సందర్భోచితంగా వడుచుకోవచ్చులెమ్మనుకుని కాస్త డబ్బు జేబులో పెట్టుకుని, కాయితాలు చేతపట్టుకుని ఆ ఆఫీసుకు బయల్దేరేను నేను వెళ్లేసరికి ఆమె సీటుముందర ఇద్దరు వ్యక్తులు కూర్చుని వుండ టంతో నేను దూరంగా నిలబడిపోయాను. వాళ్లు వెళ్ళాక ఆమెని కలుద్దామని ఆఫీసు వాతావరణాన్ని చూస్తూవుండిపోయాను.

మధ్యమధ్యలో ఆ ఇద్దర్నీ గమనిస్తూనే వున్నాను, ఆమెకేమైనా ముడుపులు సమర్పించుకుంటున్నారేమోనని. వాళ్లిద్దరూ నవ్వుతూ, బ్రతిమాలుతూ ఏదేదో మాట్లాడుతున్నారు. ఆమె మాత్రం పొరబాటున కూడా నవ్వనేది ముఖంలో కన్పించకుండా జాగ్రత్తపడుతున్నట్లని పించింది. గంభీరంగా, మొండిగా, నిర్లక్ష్యంగా, నిర్దాక్షిణ్యంగా వున్నట్లనిపించింది.

ఆమెని గురించి వినివుండటం వల్ల బహుశా ఊహని గురించి నేను ఎక్కువగా ఊహిస్తున్నానేమో అన్న నా ఆలోచనకి నాకే నవ్వు వచ్చింది.

ఓ పదినిమిషాల నిరీక్షణ తర్వాత ఆ ఇద్దరు వ్యక్తులు వెళ్లిపో యారు. వెంటనే నేను వెళ్లి ఊహ సీటుదగ్గరకు చేరేను. కుర్చీలో కూర్చున్నాను.

"ఏం కావాలి" మొరటుగా ధ్వనించిందామె గొంతు.

సౌమ్యంగా అడిగివుంటే కాస్తంత, చిరునవ్వు పులుముకుని చెప్పివుండేవాడ్నేమో! బాగా బలంగా, దృఢంగా, పొడుగ్గా వస్తాదులా వున్న మనిషి మీసాలు పెంచేసి, ముఖం చిటమటలాడించుకుంటూ, ఎర్రటి కళ్ళతో కన్పిస్తుంటే ఆ గొంతులోంచి కాఠిన్యతను వూహిస్తాం కానీ ఆ గొంతు అతి పేలవంగా, పీలగా, వినయంగా పలికిందను కొండి కాస్తంత తొట్రుపాటు కలుగుతుంది. అదే కాస్తంత సన్నగా, పొట్టిగా, సుకుమారంగా కన్పించే వ్యక్తి ఓ భయంకరమైన గొంతుతో మాట్లాడినప్పుడు కాస్తంత కలవరపడతాం.

ఆ కారణంగా అందంగా, సుకుమారంగా, కోమలంగా కన్పించే ఊహ అలా విసురుగా, విసుగ్గా, కొట్టినట్లు అడిగేటికి "మనిషి అంత అందగా వుంది, మాటేమిటి ఇంత వికారం" అనిపించింది. "అసలీమె నవ్వుతూ మాట్లాడుతుంటే ఎంత అందంగా వుంటుందో. ఇంట్లోనన్నా అలా వుంటుందా. ఎప్పుడైనా ఇలా కట్టి విరిచినట్లు మాట్లాడటం ఆమె లక్షణమేమో - తప్పేంవుంది. ఎవరి అలవాటు వాళ్లది" అనుకున్నా దాని దుంపతెగ నా మనసు అంగీక రించనని మొరాయించటం మొదలు పెట్టింది.

"ఉద్యోగం చేస్తున్నది కాబట్టి రోజూ నాలాంటివాళ్లు వచ్చి వెళ్తుంటారు కాబట్టి" అందరికీ సమాధానాలు చెప్తుండాలి, పనులు చేయాలి కాబట్టి అందర్లాగే ఆమెకీ అప్పుడప్పుడూ విసుగనిపించటం అసహజం కాదుగా. ఇవన్నీ అయినా అవచ్చు లేకపోతే లంచం తీసుకునే అవకాశం వున్న సీటుగాబట్టి, అలాంటి సీట్లలో పనిచేసే

వారు ప్రసన్న వదనంతో కన్పిస్తే "లక్ష్మీప్రసన్నం" చేసుకోవటం కాస్తంత కష్టం అని అనుభవపూర్వకంగానో, అనుభవజ్ఞుల ద్వారానో తెలిసికొని అలా మాట్లాడటం అలవాటు చేసుకుని వుంటుంది.

"ఏం కావాలి" అని నన్నడిగి నేను సమాధానం చెప్పేలోపే ఆమె లేచి నిలబడి పక్క నున్న బీరువాలో ఏదో ఫైలు వెతుక్కుంటున్న కారణంగా ఇంతసేపూ ఆలోచనల్లో పడిపోయాను. "చెప్పండి" అంటూ కుర్చీలో కూర్చుందామె.

నాక్కావాల్సిన పని చెప్పేను. "చాలా కష్టం" అంటూ తల అడ్డంగా వూపింది "అలా అనకపోతే డబ్బులెలా వస్తాయ్" మనసులో అనుకుని-"ఎలాగైనా....మీరే....ఏదో ఉపాయం చెప్పాలి"అన్నాను

ఉపాయాలేముంటయ్యండి, రూల్సుంటయ్‌గాని, ఎవరుచేసినా, ఏం చేసినా వాటికి లోబడేకదా చేయాలి" ఫైల్ లోకి చూస్తూ నాతో మాట్లాడుతున్న ఆమె వైఖరి నాకు కోపం తెప్పించింది.

"లంచాలు తీసుకోకుండా ఏ రూలు అడ్డంపడటంలేదుకాబోలు" నా మనసు ఆవేశంగా మూలిగింది.

"ఎంత ఇమ్మంటారు" అడిగాను సూటిగా.

"అయాం సారీ .. నేనలాంటిదాన్ని కాదు"

ఆశ్చర్యపోయాను ఆమె సమాధానం విని.

మరికాసేపు ఆమెని బ్రతిమిలాబటం. ఆమె కుదరదనటం జరిగాక మెల్లగా లేచి బయల్దేరాను. రెండురోజుల తర్వాత ఓ మధ్యవర్తిని తీసుకుని ఊహ ఆఫీసులో వుండే సమయంలో వాళ్ళ యింటికి వెళ్ళాను. ఆమె తండ్రితో, మధ్యవర్తి ద్వారా పరిచయం చేసుకున్నాను. పని చెప్పేను. బేరం కుదిరింది. ఆయన దగ్గర మాట తీసుకుని ధైర్యంగా ఇంటిముఖం పట్టాను. నెలరోజుల్లోగా నా పనిపూర్తయింది. పనిగట్టుకుని ఆఫీసుకు వెళ్ళి ఊహని కలిశాను. కృతజ్ఞతలు

చెప్పేసాను. అమేం కుంచించుకుపోలేదు. చాలా మామూలుగా తలా డించి పూరుకున్నది. ఉసూరుమంటూ వెనక్కి తిరిగాను

నవలల్లోనూ, సినిమాల్లోనూ జరిగినట్లు నేను ఏ మధ్యవర్తి ద్వారా ఊహ తండ్రికి పరిచయం చేసుకుని నా పని చేయించుకు న్నానో అదే మధ్యవర్తి నాకు ఉద్యోగం వచ్చాక ఊహతో నాపెళ్ళి జరిపించేశాడు. కాకతాళీయంగా జరిగిపోయింది నా పెళ్ళి.

ముందుగానే చెప్పటానికి సంకోచించాగానీ నేనే కాంతారావుని కథ ఇంతవరకు రాసి ఊహకి చూపించాను.

ఉరిమి చూసింది. "ఇది ఎవరికీ పంపకండి" అని ఆజ్ఞాపించింది

"ఎందుకని" అడిగేను నవ్వావుకుంటూ.

ఉక్రోషంగా చూసింది.

ప్రచురణ జరిగితే వచ్చే పారితోషికం అంతా తనకే ఇస్తా నన్నాను. "సరే అయితే" అన్నది ఆమాట వినంగానే!

—o—